క్లుప్తంగా

పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



చెన్నమ్మ సర్కిల్ వద్ద శానిటేషన్ సిబ్బంది గైర్హాజరుపై ఆరా తీస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్) : పారిశుద్ధ్య పనుల్లో సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ హెచ్చరించారు. శుక్రవారం నగరంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన తనిఖీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంపాక్టర్ డ్రైవర్ ముర్తుజా వలీ, ట్రాక్టర్ డ్రైవర్ పరమేశ్వరుడు, వర్కర్లు రామాంజనేయులు, జగదీష్, విజయ్‌లను సస్పెండ్ చేయాలని ఆదేశించారు.

● నగరంలోని స్థానిక బిర్లా సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన ఈట్ స్ట్రీట్‌లో వ్యాపారులు తప్పనిసరిగా పరిశుభ్రత పాటించాలని కమిషనర్ భార్గవ్‌తేజ వెల్లడించారు. శుక్రవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

ఆర్ఐకు అదనపు బాధ్యతలు

కర్నూలు (టౌన్): నగరపాలక రెవెన్యూ విభాగంలో పనిచేసే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖలీల్-ఉర్-రెహమాన్‌కు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అదనపు బాధ్యతలు అప్పగించారు. గతంలో పనిచేసిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌ను ప్రభుత్వం కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌కు పీఏగా నియమించింది. దీంతో ఆయన నిర్వర్తిస్తున్న బాధ్యతలు ఖలీల్-ఉర్-రెహమాన్‌కు అప్పగిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

కామ్రేడ్ షడ్రక్ ఆశయాలను కొనసాగిద్దాం

కర్నూలు(రూరల్): పేద ప్రజల అభివృద్ధికి పరితపించిన కామ్రేడ్ షడ్రక్ ఆశయాలను కొనసాగిస్తామన్ని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి. నిర్మల తెలిపారు. శుక్రవారం నగరంలోని సుందరయ్య భవనంలో రోడ్డు సైడ్ చిన్న వ్యాపారస్తుల సంఘం ఆధ్వర్యంలో ఆయన 3వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. షడ్రక్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కల్లూరు: ముజఫర్‌నగర్‌లోని టీసీ లక్ష్మమ్మ కుట్టు మిషన్ సెంటర్‌లో షడ్రక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

క్యాబినేట్ సెక్రటరీగా రామరాజు ప్రమాణ స్వీకారం



రామరాజును అభినందిస్తున్న విజయకుమార్‌రాజు

కర్నూలు(అర్బన్): లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 316జే క్యాబినేట్ సెక్రెటరీగా నగరానికి చెందిన ఎస్. వెంకట రామరాజు ప్రమాణ స్వీకారం చేశారు. శుక్రవారం స్థానిక మౌర్యా ఇన్ హోటల్ సమావేశ హాల్‌లో జరిగిన జిల్లా 316జే 6వ కన్వెన్షన్‌లో రామరాజుతో లయన్స్ మాజీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ వి. విజయకుమార్‌రాజు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మల్టీపుల్ కౌన్సిల్ చైర్మన్ రవీంద్రనాథ్, మల్టీపుల్ ఏరియా లీడర్ సుధాకర్‌రెడ్డి, జిల్లా గవర్నర్ నాగేశ్వరరావు, ఇతర జిల్లాల మాజీ గవర్నర్లు హాజరయ్యారు.

లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్‌గా నాగేశ్వర యాదవ్

కర్నూలు (న్యూసిటీ) : లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 316జే నూతన గవర్నర్‌గా వై.నాగేశ్వర యాదవ్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. కర్నూలులోని మౌర్య ఇన్ హోటల్ పరిణయ హాల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్, పారిశ్రామికవేత్త టీజీ భరత్, టీడీపీ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, లయన్స్ మాజీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ వి.విజయకుమార్‌రాజు, ప్రతినిధులు హాజరయ్యారు. అంతకు ముందు కలెక్టరేట్ నుంచి రాజ్‌విహార్ వరకు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతిర్యాలీలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, పీస్ కమిటీ చైర్మన్ లయన్ పద్మలత, కేవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

- జిల్లా వ్యాప్తంగా కండ్ల కలక విస్తరణ
- కంటి వైద్యుల వద్దకు పరుగులు
- ఉమ్మడి జిల్లాలో 10 శాతం మందికి వ్యాధి
- ప్రభుత్వ కంటి ఆసుపత్రిలో ప్రత్యేక ఓపీ
- ప్రతిరోజు 250 మందికి చికిత్స
- మందులు, మాత్రలు ఉచితం

'కలక'లం!



ప్రత్యేక ఓపీలో చికిత్స చేస్తున్న వైద్యసిబ్బంది



తరచూ చేతులను శుభ్రం చేసుకోవాలి. మనిషికి మనిషికి మధ్య దూరం పాటించాలి. ఏంటి ఇవి కోవిడ్ జాగ్రత్తలాగా ఉన్నాయనుకుంటున్నారా..? అవే కానీ ఇప్పుడు కండ్ల కలకకు వాటిని పాటించాల్సి వస్తోంది. జిల్లా వ్యాప్తంగా శరవేగంగా విస్తరిస్తున్న ఈ వైరస్ ప్రజల కంట్లో నీళ్ల తెప్పిస్తోంది. ఈ వ్యాధికి ముందుజాగ్రత్తగా ప్రభుత్వాసుపత్రిలో ప్రత్యేక ఓపీ ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు.

– కర్నూలు(హాస్పిటల్)

ఒకప్పుడు ముక్కుకు మాస్క్ వేసుకోవాల్సి వచ్చింది...ఇప్పుడు కళ్లకు అద్దాలు పెట్టుకోవాల్సి వస్తోందని సోషల్ మీడియాలో చలోక్తులు అధికమయ్యాయి. కానీ వాస్తవంగా జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. ప్రతి పది మందిలో ఇద్దరు వ్యక్తులు కండ్ల కలక బారిన పడుతున్నారు. ఎక్కడ చూసినా కళ్లు ఎర్రబడ్డ వారు రోడ్లపై కనిపిస్తున్నారు. కండ్లకలక సోకిన వారు ఎక్కువగా పూర్తిగా కప్పే అద్దాలను ధరించి తిరుగుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లోని వైద్యులు, చివరికి ఆర్ఎంపీల వద్దకు కూడా వెళ్లి కంటికి చికిత్స చేయించుకుంటున్నారు. ప్రతి వైద్యుని వద్దకు సగటున రోజూ కండ్ల కలక వచ్చిన వారు 20 మంది దాకా వస్తున్నారు. కర్నూలులోని ప్రాంతీయ ప్రభుత్వ కంటి వైద్యశాలకు ప్రతిరోజూ 200 నుంచి 250 మంది చికిత్స కోసం వస్తున్నారు. రద్దీ ఎక్కువ కావడంతో ఆసుపత్రిలోని ఇతరులకు సోకకుండా 10 రోజుల నుంచి కండ్లకలకకు ప్రత్యేక ఓపీ నిర్వహిస్తున్నారు. ఆసుపత్రిలోకి వెళ్లగానే ఎదురుగా వైద్యసిబ్బంది ప్రత్యేకంగా ఈ వ్యాధికి చికిత్స చేస్తున్నారు. అవసరమైన వారికి కళ్లలో డ్రాప్స్, మాత్రలు ఉచితంగా అందజేస్తున్నారు. చాలా మంది కళ్లు ఎర్రబారగానే నేరుగా మెడికల్‌షాపులకు వెళ్లి డ్రాప్స్ కొని వాడుతున్నారు. మరికొందరు ఇళ్ల సమీపంలోని దుకాణాల్లో లభించే ట్యూబ్‌లను కొని వాడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 10 శాతానికి పైగా విద్యార్థులు ఈ వ్యాధి బారిన పడ్డారు. కండ్లకలక వచ్చిందని తెలియగానే ఇతరులకు సోకకుండా సదరు విద్యార్థులను ఉపాధ్యాయులు వెంటనే ఇళ్లకు పంపిస్తున్నారు. ఇళ్లకు వెళ్లిన విద్యార్థుల ద్వారా కుటుంబసభ్యులకు ఈ వ్యాధి సోకుతోంది. వీరి ద్వారా సమాజంలోని ఇతరులకూ పాకుతోంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

కళ్ల నుంచి కారే నీటిని, స్రావాన్ని శుభ్రమైన తడిబట్టతో శుభ్రపరుస్తూ ఉండాలి. రోగి వాడే బట్టలు, పక్క బట్టలు, తువ్వాళ్లు మొదలైన వాటికి కళ్ల నుంచి కారిన రసి అంటి వాటిని ఇతరులు వాడితే వ్యాధి వారికి కూడా సోకుతుంది. కావున రోగి బట్టలు ప్రతిరోజూ నీటితో ఉడికించి క్రిమిరహితం చేయాలి. రోగికి డ్రాప్స్ వేసేవారు సాధ్యమైనంత వరకు వారి కళ్లను తాకకుండా వేయాలి. తాకితే వెంటనే చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. రోగికి చాలా దగ్గరగా ఉండి చూడకూడదు. రోగి కళ్లను శుభ్రపరిచిన దూది లేక బట్ట ముక్కలను వేరే పోగుచేసి కాల్చివేయడం మంచిది.

కండ్ల కలక లక్షణాలు

- ➤ కండ్ల కలక వచ్చిన వారి కళ్లు ఎరుపెక్కి, నీరు గారుతూ ఉంటాయి. కంటిరెప్పలు ఉబ్బి ఉంటాయి
- ➤ కళ్లలో మంట, నొప్పి, కొద్దిపాటి దురద కూడా ఉంటుంది
- ➤ ముక్కులో నీరు కారడం, జ్వరం వచ్చినట్లు ఉంటుంది
- ➤ వెలుతురు చూడటం కష్టంగా మారుతుంది. కళ్లలో పుసులు పడతాయి –ఈ లక్షణాలు ఒక కంటిలో ప్రారంభమై రెండవ కంటికి వ్యాపిస్తాయి నిద్ర తర్వాత కళ్లరెప్పలు అంటుకుని తెరవడం కష్టమవుతుంది
- ➤ ఈ వ్యాధి త్వరగా వ్యాప్తి చెంది అంటువ్యాధిగా మారుతుంది

జాగ్రత్తలు తీసుకుంటే చాలు



ఆసుపత్రికి ప్రతిరోజూ 250 మంది రోగులు చికిత్స కోసం వస్తున్నారు. వీరిలో కొందరు సాధారణంగా, మరికొందరు తీవ్రంగా కండ్ల కలక ఉంటోంది. వీరికి అవసరమైన డ్రాప్స్, మందులు ఇచ్చి పంపిస్తున్నాము. ఇందుకోసం ప్రత్యేక ఓపీ ఏర్పాటు చేశాము. సాధారణంగా ఇది వారం, పదిరోజుల్లో తగ్గిపోతుంది. ఒక్కరికి వచ్చిందంటే ఇంటిల్లి పాదికీ వచ్చే అవకాశం ఉంది. తక్కువ తీవ్రత ఉన్న వారికి టియర్ డ్రాప్స్‌తో తగ్గిపోతుంది. తీవ్రంగా ఉండే వారికి యాంటిబయాటిక్ డ్రాప్స్‌తో పాటు మందులు వాడాల్సి ఉంటుంది.

–డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రి, కర్నూలు

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

● గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



చిత్తారి వీధిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందజేస్తోందని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక 5వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. చిత్తరి వీధి ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అలాగే సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అక్కడికక్కడే మునిసిపల్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారని చెప్పారు. కులమతాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి కలిగిస్తున్నారని చెప్పారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా వివిధ రకాల ప్రభుత్వ సేవలను ఇంటి వద్దకు చేర్చారన్నారు. లబ్ధి పొందిన ప్రతి కుటుంబం వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుజాత, పార్టీ నాయకులు శేషుయాదవ్, నాయకులు అక్బర్ అలీ, మహబూబ్ బాషా, ఖాదర్, మక్బూద్, అబ్దుల్లా, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు

- ●ఎమ్మెల్యే కాటసాని, మేయర్ బీవై రామయ్య రామయ్య
- ●19వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం



వార్డు సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాటసాని, మేయర్ బీవై రామయ్య

కల్లూరు : నవరత్నాల సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 19వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. వారు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. మహిళలను, వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించి బుక్‌లెట్లను పంపిణీ చేశారు. కాలనీలో ఏవైన సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలని, అందుకోసమే మేమంతా గడప గడపకు వస్తున్నామన్నారు. తాగునీరు పైపులైన్, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, మురుగు కాలువలు, సీసీ రోడ్లు నిర్మించాలని కాలనీ వాసులు ప్రజాప్రతినిధులను కోరారు. ఆయా సమస్యలను సకాలంలో పరిష్కారించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు

వర్ష కాలంలో నగరాన్ని శుభ్రంగా ఉంచుతున్న పారిశుద్ధ్య కార్మికులకు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో రెయిన్‌కోట్లను ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య అందించారు. కార్మికుల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్మికులందరికి జీవిత/ప్రమాద బీమమా చేయించామని, ప్రతి ఏటా వస్త్రాలు, కిట్లు అందజేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత వాన కాలంలో కార్మికులు తడవకుండా ఉండేందుకు రూ. 3.85 లక్షలతో వెయ్యి మంది పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్‌కోట్లను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, డీఏపీబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు అరుణ, శ్వేతారెడ్డి, నాగలక్ష్మిరెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, నారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలి

కర్నూలు కల్చరల్/సెంట్రల్: బదిలీలు, పదోన్నతలు పొందిన ఉపాధ్యాయుల జీతాలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లప్ప, జయరాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం డీఈఓ కార్యాలయం వద్ద యూటీఎఫ్ నాయకులు ధర్నా నిర్వహించారు.

● ఇటీవల పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు వెంటనే జూన్, జూలై మాసాల జీతాలు చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఆ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

కర్నూలు కల్చరల్: ఆధునిక జీవన విధానానికి అనుగుణంగా ఆరోగ్య సూత్రాలు పాటించాలని రవీంద్ర ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ జీవీఎం మోహన్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆ కళాశాలలో 'ఆర్‌సీఈడబ్ల్యూ స్వస్తా' పేరుతో హెల్త్ క్లబ్ ప్రారంభించారు. హెల్త్ క్లబ్ లోగోను ఆవిష్కరించి చైర్మన్ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఈ శ్రీనివాసమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ఉషశ్రీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంతో అనుసంధానం చేయాలి

కర్నూలు(రూరల్): ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగంతో అనుసంధానం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జగన్నాథం శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఆయన మాట్లాడుతూ పెరిగిన విత్తనాలు, పురుగు మందు ధరలను,వ్యవసాయ కూలీల ఖర్చులను రైతులు భరించలేకపోతున్నారన్నారు. ఈ అంశంపై ఈ నెల 7వ తేదీన నిర్వహిస్తున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కార్మికులకు సరెండర్ లీవ్ చెల్లించండి

కర్నూలు(టౌన్) : శాశ్వత పారిశుధ్య కార్మికులకు రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ పారిశుధ్య సంఘం అధ్యక్షుడు మునెప్ప కోరారు. శుక్రవారం ఆయన నగరపాలక సంస్థ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఆక్రమణల నుంచి హంద్రీని కాపాడండి

కర్నూలు కల్చరల్: అగ్రోసేని రియల్టర్ నుంచి హంద్రీ నదిని కాపాడాలని రాయలసీమ యువజన, విద్యార్థి సంఘాల నాయకులు వీవీ నాయుడు, రవి కుమార్, రంగముని డిమాండ్ చేశారు. శుక్రవారం ఇరిగేషన్ అధికారులు ఆ ప్రాంతంలో సర్వే నిర్వహించడంతో విద్యార్థి సంఘాల నాయకులు అగ్రోసేని వెంచర్, హంద్రీనది పరిసర ప్రాంతాలను సందర్శించారు. హంద్రీ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

మద్యాన్ని నిషేధించాలి

కర్నూలు(రూరల్): మద్యాన్ని నిషేధించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి డిమాండ్ చేశారు. హింసపై మహిళల పోరు యాత్ర శుక్రవారం నగరానికి చేరుకుంది. ఈ సందర్భంగా నగరంలోని సుందరయ్య సర్కిల్‌లో బహిరంగ సభ నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, సీనియర్ నాయకురాలు పి నిర్మల, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అలివేలు, అరుణ, మహిళ సంఘం నాయకురాలు పద్మ, ధనలక్ష్మి, సుజాత, కిరణ్మయి, రషీదా, కై రూన్‌బీ, అమీనా తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి ఆజాదికా అమృత్ మహోత్సవం

కర్నూలు(అగ్రికల్చర్): స్వాతంత్ర్య వేడుకల నేపథ్యంలో ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు ఆజాదికా అమృత్ మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయం నుంచి ఏపీడీలు, ఏపీవోలు, ఈసీలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద 75 మొక్కలు నాటాలని సూచించారు. అలాగే జిల్లాలోని ప్రతి మండలంలో 10 రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు నిర్మించడంపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించొద్దన్నారు.

టీడీపీ నాయకుల నిరసన

కర్నూలు (న్యూసిటీ): టీడీపీ అధినే చంద్రబాబు నాయుడు పర్యటనను అడ్డుకోవడం సరికాదని ఆ పార్టీ కర్నూలు పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆకెపోగు ప్రభాకర్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఆ పార్టీ కార్యాలయం ఎదుట వారు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

విద్యుత్ సమాచారం

పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు టౌన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీరు రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు అభివృద్ధి పనులు చేపడుతున్న కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు బాలాజీ నగర్, స్టాంటన్‌పురం, సంతోష్ నగర్, పెద్దపాడు, వాటి చుట్టు పక్కల ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు.

రేపటి కార్యక్రమాలు

గణేష్ ఉత్సవ సమితి సమావేశం

కర్నూలు కల్చరల్: కర్నూలు విభాగ్ (ఉమ్మడి కర్నూలు జిల్లా) శ్రీగణేష్ ఉత్సవ సమితి సమావేశం ఈనెల 6వ తేదీ ఉదయం 9.30 గంటలకు స్థానిక వినాయక ఘాట్ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవాలయం సమావేశ మందిరంలో జరుగుతుందని జిల్లా సంఘటనా కార్యదర్శి ఎం.నాగఫణిశాస్త్రి తెలిపారు. కేంద్ర ఉత్సవ సమితి ప్రతినిధులతో పాటు మండల ఉత్సవ సమితి సభ్యులు సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

గుండెజబ్బులపై అవగాహన సదస్సు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన గుండెజబ్బులపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు స్థానిక ఎ.క్యాంపులోని కర్నూలు హెల్త్‌క్లబ్‌లో సదస్సు ప్రారంభమవుతుందని, గుండెజబ్బులపై కార్డియాలజిస్టు డాక్టర్ వసంతకుమార్ అవగాహన కల్పిస్తారన్నారు.

విద్యా సమాచారం

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలు ప్రారంభం

కర్నూలు కల్చరల్: ఆంధ్ర ప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పదో తరగతి, ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ఆర్ఐఓ గురవయ్య శెట్టి, కర్నూలు డివిజన్ ఉప విద్యాధికారి హనుమంతరావు పేర్కొన్నారు. శుక్రవారం ఏపీఓఎస్ఎస్ ప్రవేశాలపై ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు సమగ్ర శిక్ష అభియాన్ సమావేశ మందిరంలో అవగాహన కల్పించి, ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

స్పోర్ట్స్

ఒలింపిక్ సంఘం జిల్లా చైర్మన్‌గా మహబూబ్‌బాషా

కర్నూలు(రూరల్): ఒలింపిక్ సంఘం కర్నూలు జిల్లా చైర్మన్‌గా ఎస్ఎంబీ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ మహబూబ్ బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం నగరంలోని గెలాక్సీ స్కూల్‌లో ఒలింపిక్ సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకున్ని వారం రోజుల పాటు క్రీడా సంబరాలను నిర్వహిస్తామన్నారు.

నీటి వనరుల సంరక్షణ అందరి బాధ్యత



ప్రాజెక్ట్ వద్ద జలహారతి పూజల్లో అధికారులు

శ్రీశైలంప్రాజెక్ట్: మానవ మనగడకు నీరు ఎంతో అవసరమని, నీటి వనరులను ప్రతి ఒక్కరూ సంరక్షించుకోవాలని జలశక్తి ఫైనాన్స్ డిప్యూటీ సెక్రటరీ అక్షయ్‌కుమార్ సాహూ పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో వెలుగులు నింపుతున్న శ్రీశైలంప్రాజెక్ట్ నిర్మాణానికి పునాది వేసి 60 వసంతాల సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో సెంట్రల్ వాటర్ కమిషన్ చీఫ్ సభ్యులు పాల్గొన్నారు. ప్రాజెక్ట్ ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులు, డ్యామ్ ఇంజినీర్లు, సిబ్బంది ర్యాలీ ప్రాజెక్ట్ వ్యూ పాయింట్ వద్దకు చేరుకున్నారు. అక్కడ సేవ్ వాటర్ పేరుతో మొక్కలు నాటారు. అనంతరం డ్యామ్ వద్దకు చేరుకుని కృష్ణమ్మ జలహారతి ఇచ్చారు. కార్యక్రమంలో సెంట్రల్ వాటర్ కమిషన్ చీఫ్ ఇంజినీర్ రంగారెడ్డి, నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ అధికారి ఆర్.తంగముణి, హైడ్రాలజీ చీఫ్ ఇంజినీర్ టీవీఎస్ఆర్.కుమార్, సీడబ్ల్యూసీ డిప్యూటీ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, జలవనరుల శాఖ చీఫ్ ఇంజినీర్ కబీర్‌బాషా, ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి, డిప్యూటీ ఎస్ఈ గంగాధర్ రెడ్డి, ఈఈలు మనోహర్ రాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సామాజిక తనిఖీలు

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో కన్వర్జెన్సీ కింద చేపట్టిన అభివృద్ధి పనుల్లో సామాజిక తనిఖీలకు సహకరించాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి వివిధ శాఖల అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో కన్వర్జెన్సీ శాఖల అధికారులతో సోషల్ ఆడిట్ నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో డ్వామా విజిలెన్స్ అధికారి శిద్ధలింగమూర్తి, కన్వర్జెన్సీ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దోమలు ప్రబలకుండా చూడాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): పగటి పూటే కుట్టే డెంగీ దోమలు ప్రబలకుండా చూడాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. శుక్రవారం ఆయన స్థానిక వీకర్‌సెక్షన్ కాలనీలోని యూపీహెచ్‌సీని సందర్శించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో కలిసి కాలనీలను పరిశీలించారు. అనంతరం ఇందిరమ్మ గృహాల్లోని లక్ష్మీపురం యూపీహెచ్‌సీని సందర్శించి రికార్డులు పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని, వైరల్ ఇన్‌ఫెక్షన్ అయిన కండ్ల కలక వచ్చిన వారికి మందులు ఇవ్వాలని సూచించారు.

➤ సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉండటంతో నివాస పరిసరాల్లో దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మాస్ మీడియా అధికారిణి ప్రమీలాదేవి చెప్పారు. శుక్రవారం ఆమె ముజఫర్‌నగర్‌లోని యూపీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. వైద్యాధికారి డాక్టర్ సుప్రియ, డిప్యూటీ మాస్ మీడియా అధికారి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మెడికల్ మాఫియాను అరికట్టాలి

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వ్యాప్తంగా మెడికల్ మాఫియాను అరికట్టడంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు విఫలమయ్యారని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు ఆరోపించారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ నగరంలోని పలు డయాగ్నోస్టిక్స్ ఎలాంటి అనుమతి లేకుండా విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి మెడికల్ మాఫియా ను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగర కార్యదర్శి బాబయ్య, టీసన్న పాల్గొన్నారు.